నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 20 డిసెంబర్ 2023 | JOGULAMBA GADWAL WANAPARTHY

కొల్లాపూర్ మండలం సింగవట్నంలో అలుగుపారుతున్న శ్రీవారి సముద్రం చెరువు

మత్తడి దుంకిన సింగవట్నం

- ఈ సీజన్‌లో ప్రథమంగా అలుగుపారిన రిజర్వాయర్
- నిండుకుండలా శ్రీవారి సముద్రం

కొల్లాపూర్, డిసెంబర్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగవట్నంలోని శ్రీవారి సముద్రం చెరువు (రిజర్వాయర్) నిండి అలుగుపారుతున్నది. ఈ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0.55 టీఎంసీలు(29 ఫీట్లు)కాగా పూర్తిగా నీటితో నిండి అలుగు దుంకడం ఈ సీజన్‌లో ప్రథమం. రూ. 94 లక్షలతో రిజర్వాయర్ అలుగు మరమ్మతులు చేపట్టడంతో ఇంతకాలంగా నీటిని పూర్తి స్థాయిలో నీటి పారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులు నింపలేదు. మండలంలోని రేగుమాన్‌గడ్డ కృష్ణానది తీరంలో నిర్మించిన మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కృష్ణానది నీటిని మోటర్ల ద్వారా గ్రావిటీ కెనాల్ నుంచి ఎల్లూరు మొదటి రిజర్వాయర్, అటు నుంచి సింగవట్నం రిజర్వాయర్, జొన్నలబొగుడ రిజర్వాయర్, చివరగా గుడిపల్లిగట్టు రిజర్వాయర్ ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 4.25లక్షల ఎకరాలకు సాగు నీరందుతుంది. అయితే క్రమంగా కృష్ణానదిలో నీరు తగ్గుమొఖం పడుతుండడంతో యాసంగి సాగు కోసం రైతులకు కావాల్సిన నీటిని ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో భాగంగా ఉన్న నాలుగు రిజర్వాయర్లను ముందస్తుగా నింపుతున్నట్లుగా సమాచారం. అయితే ఈ యాసంగి సాగుకు ఆయా రిజర్వాయర్ల నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారా.. లేకా క్రాఫ్ హాలిడే ప్రకటిస్తారా అన్నది తెలియకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. నీటి వనరుల కింద వరి నారు పోయాలా? వద్దా అన్న విషయంపై మీమాంస ఎదుర్కొంటున్నారు. అయితే ఒక వేళ నీటిపారుదల అధికారులు క్రాఫ్ హాలీడే ప్రకటిస్తే మూగజీవాలకు తాగునీటికి రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని రిజర్వాయర్‌లో నీటిని నిల్వ ఉంచవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

కొల్లాపూర్ డిపోలో డ్రైవర్లను సన్మానిస్తున్న డిపో మేనేజర్ ఉమాశంకర్, అధికారులు

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ

- బస్సులో బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికులు
- తులంన్నర బంగారం, రూ.5,100 నగదు, వస్తువులు తిరిగి అందజేత
- ఇద్దరు డ్రైవర్లనూ సన్మానించిన కొల్లాపూర్ డిపో డీఎం

కొల్లాపూర్, డిసెంబర్ 19 : ఆర్టీసీ బస్సులో విలువైన వస్తువులు, నగదు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను మరిచిపోయి వెళ్లిన ప్రయాణికురాలికి తిరిగి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా.. 17వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు ఏపీలోని తిరుపతిలో బయలుదేరిన కొల్లాపూర్ డిపోకు చెందిన డీలక్స్ (38 జెడ్ 0004)లో అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన రెడ్డినాథ్, లక్ష్మీదేవి దంపతులు ప్రయాణించారు. అయితే అర్ధరాత్రి 12 గంటల సమయంలో కర్నూల్ బస్టాండ్‌లో లక్ష్మీదేవి హ్యాండ్ బ్యాగ్‌ను మరిచిపోయి బస్ దిగిపోయారు. కొద్దిసేపటికే తేరుకొని ఆందోళన చెందారు. గూగుల్ సర్చ్‌లోకి వెళ్లి కొల్లాపూర్ డిపోకు సంబంధించి తిరుపతి నుంచి బయలుదేరిన బస్సు వివరాలు, ప్రకటన ఫ్లెక్సీపై ఉన్న ఏడీసీ ఖాజామైనొద్దీన్ సెల్ నెంబర్ ఉండడంతో వారు సంప్రదించారు. వెంటనే ఆయన బస్సు డ్రైవర్లుగా ఉన్న ఎం.కృష్ణ, రాజుకు ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. వారు హ్యాండ్ బ్యాగ్‌ను బస్సులో గుర్తించారు. అందులో ఒకటిన్నర తులం బంగారు గొలుసు, రూ.8 వేల ఫోన్, రూ.5,100లు నగదు, బైక్ ఆర్సీ, 6 ఏటీఎం కార్డులు, పాన్‌కార్డు, పూసల దండలు ఉన్నట్లు గుర్తించారు. కొల్లాపూర్ డిపోకు చేరుకున్న తర్వాత బస్సు డ్రైవరుల సెక్యూరిటీ గార్డుకు బ్యాగ్ అప్పగించారు. సదరు దంపతులకు ఫోన్‌లో సమాచారం అందించగా మంగళవారం వారు డిపోకు చేరుకోగా హ్యాండ్ బ్యాగ్, అందులోని వస్తువులను డీఎం ఉమాశంకర్, ఏడీసీ ఖాజామైనొద్దీన్, అసిస్టెంట్ డీఎం బాలసరస్వతి, డ్రైవర్ల సమక్షంలో అప్పగించారు. అనంతరం విధి నిర్వహణలో ఉండి బ్యాగ్‌ను భద్రపర్చిన డ్రైవర్లు కృష్ణ, రాజుకు శాలువాలు కప్పి అధికారులు సన్మానించారు. వారి నిజాయితీని తోటి ఉద్యోగులు అభినందించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న వనపర్తి అదనపు కలెక్టర్ తిరుపతిరావు

జాతీయస్థాయిలో రాణించాలి

- అదనపు కలెక్టర్ తిరుపతిరావు
- విజేతలకు బహుమతుల ప్రదానం

వనపర్తి టౌన్, డిసెంబర్ 19 : క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా హాకీకి పుట్టినిల్లని ఫుట్‌బాల్, హాకీని రాష్ట్రస్థాయిలో నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఓటమి చెందిన వారు కుంగిపోకుండా మళ్లీ విజయంవైపు పయనించాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో మొత్తం 600 మంది క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉమ్మడి 10 జిల్లాల్లో 200 మంది బాలికలు క్రీడలకు హాజరు కాగా మొదటి స్థానంలో నల్లగొండ విజయం సాధించగా ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో నిజామాబాద్ జట్లు నిలిచాయి. హాకీ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ మొదటి స్థానంలో నిలవగా నల్లగొండ ద్వితీయ స్థానంలో, ఆదిలాబాద్ తృతీయ స్థానంలో నిలిచింది. బాలికల హాకీ విభాగంలో మహబూబ్‌నగర్ విజేతగా నిలువగా.. కరీంనగర్ ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి. హాకీ, ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈవో నరహరి, డీవైఎస్‌వో సుధీర్‌కుమార్, పరిశీలకులు రవి, పీడీ సురేందర్‌రెడ్డి, కుమార్, పీఈటీలు తిరుపతి, నిరంజన్ గౌడ్, మన్నెం, శ్రీధర్‌బాబు తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్, డిసెంబర్ 19 : 2023-24 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా ఉపసంచాలకుడు పాండు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యూవల్) ఉపకార వేతానాలు (ఫీజు, మెయింటెనెన్స్ చార్జీలు) పొందేందుకు ఈ-పాస్ వెబ్‌సైట్ telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకొనేందుకు కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సమాచారం ఇచ్చి దరఖాస్తులు చేయించాలని సూచించారు.

కొవిడ్‌పై మాక్ డ్రిల్ నిర్వహించాం

జిల్లాలో కరోనా కేసులు లేవు. గత అనుభవాల దృష్ట్యా వైద్యఆరోగ్య శాఖ ఆదేశంతో మాక్ డ్రిల్ నిర్వహించాం. జిల్లాలో గతంలో 34వేల కరోనా కేసులు నమోదయ్యాయి. జిల్లాలో 1,032 బెడ్లు, జిల్లా దవాఖానలో 3 వెంటిలేటర్ బెడ్లు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలోని 28 పీహెచ్‌సీలు, 6 సీహెచ్‌సీల పరిధిలో 50మంది వైద్యులు, 70 మంది నర్సులు, 291 మంది ఏఎన్ఎంలు, 889 మంది ఆశ కార్యకర్తలతోపాటుగా వెయ్యి మంది వరకు అంగన్‌వాడీ కార్యకర్తలను అప్రమత్తం చేశాం. ప్రజలు ఎలాంటి అనారోగ్య లక్షణాలున్నా సమీప దవాఖానల్లో పరీక్షలు చేయించుకొని చికిత్స చేసుకోవాలి. ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదు. జన సామర్థ్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లడం తగ్గించాలి. మాస్క్‌లు ధరించాలి. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు మరింత జాగ్రత్త వహించాలి.

- సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌వో, నాగర్‌కర్నూల్ జిల్లా

కరోనా బెల్స్

దేశంలో పెరుగుతున్న కొవిడ్ కేసులు

- కొత్తరకం వైరస్‌తో ఊపిరితిత్తులపై ప్రభావం
- ముందస్తు జాగ్రత్తలపై డాక్టర్ల సూచన
- అప్రమత్తతపై వైద్య, ఆరోగ్య శాఖ
- మాక్‌డ్రిల్ నిర్వహించిన వైద్యులు
- ఆర్టీపీసీఆర్ కిట్లు, టెస్టులపై దృష్టి

కరోనా.. ఈ పేరెత్తితే ఎంతటి వారికైనా వణుకే.. గతంలో 2020, 2021లో రెండు సార్లు ఈ మహమ్మారితో మరణమృదంగం చోటు చేసుకున్నది. ఈ వైరస్ ఇంకా కళ్ల ముందు కదలాడుతుండగానే మరోసారి దేశంలో ప్రభావం చూపిస్తోంది. ప్రమాదకరమైన వైరస్ రిటర్న్ అయింది. ఏడాదిన్నర నుంచి తన ప్రభావం చూపని కొవిడ్ మళ్లీ చాపకింద నీరులా విస్తరిస్తున్నది. రాష్ట్రంలో, జిల్లాలోనూ ఒక్క కేసూ నమోదు కాకున్నా ఈ కొత్తరకం వైరస్‌తో ఊపిరితిత్తులకు తీవ్ర ముప్పు పొంచి ఉన్నదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమై జాగ్రత్తలు, ఏర్పాట్లు చేస్తున్నది. మాక్‌డ్రిల్ నిర్వహించిన వైద్యులు ఆర్టీపీసీఆర్ కిట్లు, టెస్టులపై దృష్టి కేంద్రీకరించారు. పండుగలు, వారాంతపు, ఏడాది ముగింపు, ఆరంభ వేడుకల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

- నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ)

కరోనా వ్యాధిపై వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దేశంలో ఇటీవల కరోనా ప్రభావం ఆకస్మికంగా పెరిగింది. కేరళ సహా పలు ప్రాంతాల్లో ఈ వైరస్ ప్రభావం చూపిస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోనూ వైద్యఆరోగ్య శాఖ ముందస్తు ఏర్పాట్లను చేపడుతున్నది. గతంలో 2020, 2021లో కరోనా చూపిన ప్రభావంతో ఒక్కో జిల్లాలో వేలాది మంది మృత్యువాతపడగా అంతకు మించిన సంఖ్యలో ప్రజలు దవాఖానల పాలయ్యారు. ఫలితంగా ఆరోగ్యపరంగానూ, ఆర్థికంగానూ చితికిపోయారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కోలుకుంటున్న క్రమంలో మరోసారి కరోనా హెచ్చరికలు రావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతానికి రాష్ట్రంతోపాటుగా జిల్లాలోనూ ఈ కరోనా కేసులు ఒక్కటి నమోదు కాలేదు. కానీ వైరస్ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తే జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, తలనొప్పివంటి లక్షణాలు ఉంటాయి. దీనివల్ల మనుషుల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. తద్వారా ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురై ప్రాణాపాయ ముప్పు ఏర్పడుతుంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో చలితీవ్రత అధికంగానే ఉన్నది. దీనివల్ల వైరస్ ప్రభావం మనుషులపై అధికంగా చూపిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిందిగా వైద్యులు పేర్కొంటున్నారు. అయ్యప్ప మాలలు వేయడం, ధనుర్మాస పూజలు చేస్తుండడం, క్రిస్మస్, సంక్రాంతి పండుగలు, పాత సంవత్సరం ముగింపు, కొత్త సంవత్సరం ఆరంభ వేడుకలకు తోడుగా కొత్తగా సినిమాలు విడుదల కానున్నాయి. అలాగే వివిధ జాతరలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలన్నీ జనసామర్థ్యం పెంచేవే కావడం గమనార్హం. ఈ వైరస్ గాలి ద్వారా ఒకరి నుంచి ఒకరికి సోకుతుంది. ఇప్పటికే ప్రజలందరికీ ఈ వైరస్‌పై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ఈ ప్రమాదకర వైరస్ వల్ల ఇతర అనారోగ్య సమస్యలనూ ఇప్పటికీ చాలా మంది అనుభవిస్తున్నారు. ఈ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా రెండుసార్లు వ్యాక్సినేషన్‌తోపాటుగా బూస్టర్ డోస్‌ను సైతం అందించింది. అలాగే ఉచితంగా కరోనా పరీక్షలు, చికిత్సలు కూడా నిర్వహించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండుసార్లు దాదాపుగా 34వేల మంది కరోనాకు గురయ్యారు. అంతకంటే ఎక్కువే ఉంటారని అంచనా. ఇలాంటి ప్రమాదకర వైరస్ నుంచి ప్రజలను ముందస్తుగా కాపాడేందుకు వైద్యఆరోగ్యశాఖ ఇటీవలే మాక్ డ్రిల్ నిర్వహించింది. జిల్లాల దవాఖానలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో బెడ్ల సంఖ్య, ఆర్టీపీసీఆర్ కిట్లు, వెంటిలేటర్లు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ఎలాంటి కరోనా లక్షణాలున్నా వెంటనే శాంపిళ్లను సేకరించి పరీక్షలు నిర్వహించేలా పీహెచ్‌సీ వైద్యులకూ వైద్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు మాస్కులు ధరించాలని, రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి లక్షణాలున్నా ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకొని చికిత్సలు తీసుకోవాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా గ్రామాలాభివృద్ధి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్ తిమ్మప్ప బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

గద్వాల రూరల్, డిసెంబర్ 19 : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాలు పార్టీలకు అతీతంగా అభివృద్ధి చెందాయన్నారు. ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు, రైతువేదికలు, ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కేటాయించామని, అదేవిధంగా డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త ద్వారా నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని ఖాళీ స్థలాల్లో నాటి సంరక్షించామన్నారు. గతంలో 60ఏండ్లు పాలించిన నాయకుల వల్ల సాధ్యం కానీ గ్రామాల అభివృద్ధి కేవలం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కేసీఆర్ సారథ్యంలో సాకారం చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ఇబ్బంది కలిగిన వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లాలని అన్ని విధాలుగా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, వైస్ ఎంపీపీ దామోదర్, రమేశ్ నాయుడు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపి రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

గద్వాల, డిసెంబర్ 19 : మండల కేంద్రంలో స్వయంభూగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి (మల్దకల్ తిమ్మప్ప) బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మల్దకల్ ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందజేసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ, కర్ణాటక నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరవుతారని బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్‌ను ఆదేశించారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు, వీధిలైట్ల ఏర్పాటుతోపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, కౌన్సిలర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లి కృష్ణానది నుంచి విగ్రహాలను ఒడ్డుకు చేర్చుతున్న అధికారులు

కృష్ణానదిలో పురాతన విగ్రహాల వెలికితీత

- దాదాపు 400 విగ్రహాలు గుర్తింపు

ఇటిక్యాల, డిసెంబర్ 19 : బీచుపల్లి క్షేత్రంలోని కృష్ణానదిలో పురాతన విగ్రహాలను మంగళవారం కేంద్రీయ, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా గుర్తించారు. కొన్ని రోజులుగా బీచుపల్లి తాగునీటి పథకం ఇన్‌టేక్ వెల్ వద్ద కృష్ణానదిలో పేరుకుపోయిన రాతి విగ్రహాలను గుర్తించారు. ఈ సందర్భంగా నదిలో ఎక్కడినుంచో గత కొన్ని రోజులుగా విగ్రహాలను పారవేయడం వల్ల అవి ఎక్కడినుంచి వస్తున్నాయనే విషయమై వారు స్థానిక జాలర్లు, సమీప గ్రామ ప్రజలతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడైనా విగ్రహాలకు చిన్న డామేజ్ జరిగినా ప్రతిష్ఠించకుండా నదిలో పారవేయడం, అలాగే ఏదైనా ఆలయం శిథిలావస్థకు గురైనా నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలనుకున్నప్పుడు పాత విగ్రహాలను తొలగించి కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించడం ఆనవాయితీ అన్నారు. అయితే నదిలో దాదాపు చిన్నవి, పెద్దవి మొత్తం 400 వరకు విగ్రహాలను గుర్తించి వాటిని ఒడ్డుకు చేర్చినట్లు చెప్పారు. అయితే జిల్లా అధికారులు ఆదేశాల మేరకు వాటికి ఎక్కడికి తరలించాలో త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

విగ్రహాలను గుర్తిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లిలో పర్యటిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, డిసెంబర్ 19 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అలంపూర్ నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే విధంగా ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. ఉండవెల్లి మేజర్ పంచాయతీలో ఎమ్మెల్యే విజయుడు మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ కాలనీలను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు.. అలంపూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకే గ్రామాలను సందర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. తన గెలుపునకు కృషిచేసిన ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తకూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సుంకన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మానవపాడు, డిసెంబర్ 19 : కార్యకర్తలు అధైర్యపడొద్దు, అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన కుర్వ మద్దిలేటి తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వెంకట్రాముడు, నేతాజీగౌడ్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎన్ఆర్ @ రూ.3,331

- తగ్గిన ఆర్ఎన్ఆర్ ధాన్యం ధరలు
- వేరుశనగకు రూ.8,049

జడ్చర్ల, డిసెంబర్ 19 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఆర్ఎన్ఆర్ ధాన్యానికి అత్యధికంగా క్వింటాకు రూ.3,331 ధర పలికింది. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, కంది, ఆముదాలు, రాగులు, అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 4,006 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా గరిష్ఠంగా రూ.3,331, కనిష్ఠంగా రూ.2,009, మధ్యస్తంగా రూ.3,069 ధర పలికింది. 54 క్వింటాళ్ల మొక్కజొన్న రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,305, కనిష్ఠంగా రూ.2,290, మధ్యస్తంగా రూ.2,305 ధర లభించింది. 258 క్వింటాళ్ల హంసధాన్యం రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,159 ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 126 క్వింటాళ్ల శ్రీరాం గోల్డ్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,237, అలాగే 78 క్వింటాళ్ల సోనా రకం ధాన్యానికి గరిష్ఠంగా రూ.2789 ధర వచ్చింది. అదేవిధంగా 84క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,049 ధర పలికింది. అలాగే కందులకు రూ.8,380, ఆముదాలకు రూ.5,169 రాగులకు రూ.3,250 గరిష్ఠ ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

లేగ దూడను చంపిన చిరుత

అచ్చంపేటరూరల్, డిసెంబర్ 19 : మండలంలోని గుంపన్‌పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ముడావత్ లక్ష్మణ్ అనే రైతుకు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపినట్లు అచ్చంపేట ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపారు. మంగళవారం ఘటనా స్థలాన్ని స్థానిక సిబ్బందితో కలిసి ఫారెస్టు అధికారులు పరిశీలించారు. అయితే బాధిత రైతుకు పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు ఫారెస్టు రేంజర్ చెప్పారు. అదేవిధంగా అటవీ సమీప పొలాలు ఉన్న రైతులు వారి పశువులను సంరక్షించుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల రోజుల కిందట ముడావత్ డాక్య అనే రైతుకు చెందిన మూడు మేకలను చిరుత చంపినట్లు గ్రామస్తులు తెలిపారు.